

# భవానీద్వీపం

## –వనం వేంకట వరప్రసాదరావు



**నాలుగువందల సంవత్సరాల కాలపరిధిలో సామాజిక, చారిత్రక వాస్తవాలను, సాహిత్య, ఆధ్యాత్మిక, యోగశాస్త్ర, మంత్ర శాస్త్ర రహస్యాలను కలుపుతూ సాగిన గాథ. చరిత్ర నిర్ధారించిన సత్యాలు, చరిత్రకు అందని రహస్యాలు, చారిత్రక పురుషుల సాహసాలు, కలగలిపి సమన్వయము చేసిన గాథ. తెలియని కొన్ని వాస్తవాలను తెలియజేస్తూ, తెలుసును అనుకుంటున్న కొన్ని 'అపోహలను' దూరం చేస్తూ సాగే కల్పిత సాహసిక గాథ. స్వతంత్ర సమరరంగముతో మొదలుకొని యుద్ధ, జానపద క్రీడల మర్మాలు, సాధకుల గాథలు, త్యాగధనుల చారిత్రక గాథలు కలిసిపోయిన కాల్పనిక గాథ. ఇలానే జరిగింది అని తెలిసిన సత్యాలకు యిలా కూడా జరిగి ఉండవచ్చు అన్న చారిత్రక పరిశీలనను జోడించి, వాస్తవ దూరం కాని ఊహలతో సాగిన పరిశీలనాత్మకమైన కథ. ఒక సాహసిక యోధుడి కథతో మొదలై క్రీ.శ. 1677 నుండి ఆధునిక కాలంవరకూ తరతరాల అంతరాలను, అంతరంగాలను విభిన్న కోణాలనుండి విమర్శించిన గాథ. కొందరికి తెలిసిన కొన్నిటిని, అందరికీ తెలియాల్సిన ఎన్నిటితోనో సమన్వయము చేస్తూ సాగిన వాస్తవ గాథల, చారిత్రక సత్యాల సమ్మేళనమైన కాల్పనిక గాథ!**

## - 58 -

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

కాళీకేళీలీలలు విచిత్రమైనవి గౌరీశంకరా!' అన్నాడు కంచి స్వామి. తనపేరు ఆయనకెలా తెలిసిందో, ఆయనెవరో, ఎక్కడినుండి అక్కడికి వచ్చాడో ఊహించడానికి ప్రయత్నం చేయలేదు గౌరీశంకరులు. సన్యాసిలా వున్న ఆ వృద్ధుడితేజస్సును చూస్తూ అప్రయత్నంగా చేతులు జోడించాడు. కనులు తుడుచుకుంటూ తానూ నమస్కరించింది ఆయన ధర్మపత్ని.

'కన్నకొడుకు కోసం నువ్వు కుమిలిపోతున్నావు. కట్టుకున్నవాడిని కోల్పోయి ఈ బిడ్డ విలపిస్తున్నది. అతడు నీ కన్నకొడుకేనని చెప్పుకోలేని నీ దుస్థితికి నువ్వు దుఃఖిస్తున్నావు. అతడు తన పెనిమిటి అని చెప్పుకునే అదృష్టానికి కూడా నోచుకోలేదని ఈమె విలవిలలాడుతున్నది' అన్నాడు కంచిస్వామి ఆ గిరిజనస్త్రీని చూపిస్తూ. 'కానీ మహామాయ

మాయాజాలం! యిద్దరూ దుఃఖించేది ఒక్కడికోసమే అని తెలుసుకోలేకపోతున్నారు కదా!' అన్నాడు మళ్ళీ. అర్థంకాక అయోమయంగా చూశాడు గౌరీశంకర నామధేయుడైన ఆ వృద్ధుడు. ధారానగర రక్షకురాలైన మహాకాళీ ఆలయంలో అర్చకుడు ఆయన.

'నీ కుమారుడు కాళికలో కలిసిపోయాడు కానీ నీ మనుమడు ఎదురుగానే ఉన్నాడు గౌరీశంకరా' అన్నాడు కంచి స్వామి, ఆ గిరిజనయువతి పక్కనున్న కోడెత్రాచులాంటి యువకుడిని చూపిస్తూ. అయోమయంగా ఆ యువకుడినీ, పక్కనున్న స్త్రీని తేరిపార చూసి కంచిస్వామికి చేతులు జోడించాడు గౌరీశంకశాస్త్రి.

'మీరెవరో, ఏం చెబుతున్నారో అంతా అయోమయంగా ఉన్నది స్వామీ! మన్నించి శెలవు యిప్పించండి' అన్నాడు. కొద్దిగా ఆగుమన్నట్లు సంజ్ఞ చేసి ఆ గిరిజనస్త్రీ వైపు చూసి వారితో మాట్లాడడం మొదలుబెట్టాడు కంచిస్వామి. వారితో ఆయన మాట్లాడుతున్న భాష భిల్లుల భాష అని మాత్రమే తెలుసు గౌరీశంకరశాస్త్రికి. తనను, తన ధర్మపత్నిని చూపిస్తూ ఆ గిరిజనులతో ఆ కాషాయాంబర సన్యాసి మాట్లాడుతుంటే చూస్తూ ఉండిపోయాడు. ఆ సన్యాసి ఎవరో మహానుభావుడు అనిపించింది ఆయనకు ఆ క్షణంలో. ఆ సన్యాసి రూపురేఖలు, ఉచ్చారణ గమనించి దక్షిణాపథానికి చెందినవాడని గ్రహించాడు.

'గౌరీశంకరా! ధారానగరచక్రవర్తికి సగము దేహంగా పూజింపబడిన మహాకవి కాళిదాసు నీ కుమారుడని నీవెలా చెప్పుకోలేకపోయావో, తన పెనిమిటి అని ఈమె చెప్పుకోలేకపోయింది! ఆ కారణజన్ముడి కుమారుడే ఈ యువకుడు. నీ మనుమడు, నీ వంశాంకురం ఈ చిరంజీవి' అన్నాడు.

వృద్ధదంపతులు ఆశ్చర్యంనుండి తేరుకునేలోపే ఆ యువకుడిని చూస్తూ ఏదో అన్నాడు ఆ దక్షిణాదిస్వామి. వృద్ధదంపతుల పాదాలకు నమస్కరించాడు ఆ యువకుడు. కంగారుగా వెనుకకు అడుగులు వేస్తుండగానే తనూ వారి పాదాలంటి నమస్కరించింది ఆ గిరిజనస్త్రీ. ముఖం మీదికి చీర చెంగును లాక్కుంటూ సన్నగా రోదించింది. తల్లిని ఊరడించడానికి ప్రయత్నం చేశాడు ఆ యువకుడు.

★★★★★★★★★★★★★★★★★★★★★★★★★★★★

మంద్రస్వరంతో భాస్కరాచార్యులవారి కంఠం మంత్రమోహితులను చేస్తున్నట్లుగా వినిపిస్తున్నది. బీజాక్షరాలు లిఖింపబడిన ముగ్గుమీద మంత్రసహితంగా దర్భలను పరిపించాడు భాస్కరచార్యులవారు. వాటిమీద జింకచర్మాన్ని పరిచి, దానిమీద అక్కుభొట్లను, లక్ష్మీధరుడిని కూర్చుండబెట్టాడు.

పాఠకుడా! విస్తుపోవోకు! విశ్వరహస్యాలను నిక్షిప్తం చేసుకున్న కాలాన్ని నేను! నేను చూడనిది, చూడలేనిది ఏదీ లేదు. వివరంగా చెబుతాను. వింటావా? నీ అదృష్టం!

మహా మంత్రవేత్త ఐన భాస్కరాచార్యులవారు వారిద్దరికీ మనోతత్త్వమైన ఆజ్ఞాచక్రస్థానాన్ని అతి రహస్యమైన మంత్రశక్తితో ఉద్దీపింపజేశాడు. ఆ ఆజ్ఞాచక్రస్థానమే భూత, భవిష్యత్ వర్తమానములన్నిటినీ చూడగలిగిన మూడవనేత్రం, జ్ఞాననేత్రం. ఆ జ్ఞాన నేత్రంతో రంగభూమి మీద నాటక ప్రదర్శన చూస్తున్నట్లుగా రెండున్నరవేల సంవత్సరముల గతగాథను తిలకిస్తున్నారు అక్కుభొట్లు, లక్ష్మీధరుడు.

చూస్తున్న దృశ్యాలు స్పష్టంగా అరచేతిలో, అద్దంలో చూస్తున్నట్లుగా కనిపిస్తున్నాయి. ఆ సంభాషణలు చెవులకు స్పష్టంగా వినబడుతున్నాయి. తోడుగా భాస్కరచార్యులవారి కంఠం మంత్ర పఠనంలా మధురంగా వినబడుతున్నది.

'ధారానగర కాళీ అర్చకుడు గౌరీశంకరులకు లేకలేక కలిగిన కుమారుడు కారణజన్ముడు. శాపకారణంగా మహాసరస్వతి అంశతో జన్మించినప్పటికీ, భ్రష్టుడై, వేశ్యాలోలుడై, వ్యసనపరుడైనాడు. ధారానగర పౌరులకు బెడదగా మారిన భిల్లుల గుంపుతో కలిసి దారిదోపిడీలకు మరిగి, చివరికి భిల్లులలో కలిసిపోయాడు. గూడెం పెద్ద కూతురిని మనువాడి యధేచ్ఛగా జీవిస్తున్నాడు.

భోజచక్రవర్తి సామంతుడైన శ్రుతవర్తి కుమార్తె సర్వమంగళ. విద్యాభ్యాసం ముగించుకుని తన గురువుకు గురుదక్షిణ చెల్లించడానికి వెళ్ళింది రాకుమార్తె. దుష్టుడైన రాజగురువు గురుదక్షిణగా ఆమె పొందును కోరాడు.

గురువును తీవ్రంగా నిందించి, ప్రవర్తన మార్చుకోకపోతే మహారాజుకు చెప్పి తలతీయిస్తానని హెచ్చరించి వెళ్ళిపోయింది యువరాణి సర్వమంగళ. పాండిత్యంలో, పరాక్రమంలో తన పరీక్షలలో నెగ్గి, తనకన్నా మిన్నగా నిరూపించుకున్నవాడినే వివాహమాడుతానని ప్రకటించింది సర్వమంగళ.

తనను చేపట్టడానికి ప్రయత్నించిన మంత్రి కుమారుడిని, సేనాధిపతి కుమారుడిని పాండిత్యంలో, పరాక్రమంలో పరాజయం పాలుజేసి పరాభవించింది సర్వమంగళ. యువరాణిని తమ తమ కుమారులకు ఇల్లాలిగా చేసుకుని, రాజ్యాన్ని కబళించాలని చూసి, భంగపడిన మంత్రి, సేనా నాయకులతో కలిసి కుట్ర పన్నాడు పగబట్టిన రాజగురువు. భిల్లగుడెంలో దారులుకొట్టి బతుకుతున్న భ్రష్టుడిని, గౌరీశంకరుల కుమారుడిని ధనం ఎర చూపి, మహా వీరుడు, పండితుడు అని మభ్యపెట్టి రాకుమారితో వివాహం జరిపించాడు రాజగురువు. నిజం తెలుసుకున్న యువరాణి నగరానికి వెలుపల ఉన్న కాళీ ఆలయానికి వెళ్లి అమ్మవారిని ఆశ్రయించి విద్యను పొందుమని బోధించి పంపింది సర్వమంగళ.

మహాకాళి కరుణతో మహాపాండిత్యాన్ని, జ్ఞానాన్ని పొంది కాళిదాసు అయినాడు ఆ భ్రష్టుడు. తనకు మహాకాళి కరుణను ప్రసాదించిన సర్వమంగళ తనకు గురువుతో సమానురాలు అని ఆమెను భార్యగా చేపట్టడానికి

తిరస్కరించాడు. భగ్న హృదయురాలైన సర్వమంగళ 'నీ గతమంతా మరిచి, ఒక వేశ్యచేతిలో మరణం పాలవుతావు' అని కాళిదాసును శపించి తను ఆత్మత్యాగం చేసుకున్నది.

భోజరాజు ఆస్థానానికి చేరుకున్న కాళిదాసు మహారాజుకు ప్రీతిపాత్రుడైనాడు. తన మంత్ర శక్తితో ఎన్నో సందర్భాలలో భోజచక్రవర్తిని రక్షించాడు. మహాకావ్యాలను రచించాడు. రాచనర్తకి ఐన వేశ్యను మరిగి ఆమెతోనే జీవించడం మొదలెట్టాడు. కాళిదాసు ప్రాభవాన్ని చూసి ఓర్వలేని భోజరాజు ఆస్థాన పండితులు కుట్రపన్నారు. మహారాణి లీలావతి అంతఃపుర దాసిని ధనం ఎర చూపి లోబరచుకున్నారు. మహారాణికి, కాళిదాసుకు సంబంధం ఉన్నదని చక్రవర్తి వినేలా దాని నోటితో చెప్పించారు. పొరబడిన మహారాజు కాళిదాసుకు నగర బహిష్కరణ శిక్ష విధించాడు.

తన వేశ్య ఇంటిలోనే రహస్యంగా దాక్కుని కాలం గడపసాగాడు కాళిదాసు. క్రమంగా నిజాన్ని గ్రహించిన భోజచక్రవర్తి పశ్చాత్తాపంతో విలపించాడు. మహాకవి కాళిదాసును తిరిగి రప్పించడం కోసం ఒక సమస్యాపూరణ పోటీ ప్రకటించాడు. ఆ పోటీలో గెలిచినవారికి అర్ధరాజ్యాన్ని, తన అర్ధ సింహాసనార్హతను ప్రకటించాడు. వేశ్య ద్వారా ఆ విషయం తెలుసుకున్నాడు కాళిదాసు. మహారాజు మనసులో ఉన్న పూరణ ఏమిటో శ్లోక రూపంలో వేశ్యకు సరదాగా చెప్పాడు. ఆ పూరణా శ్లోకంతో మహారాజును మెప్పించి, అర్ధరాజ్యాన్ని పొందాలని తెగించింది ఆ వేశ్య. తనతో రతికేళిలో అలసి నిదురిస్తున్న కాళిదాసు కంఠాన్ని నరికివేసింది ఆ కఠినాత్మురాలు. భోజచక్రవర్తి ఆస్థానానికి చేరుకొని కాళిదాసు తనకు చెప్పిన సమస్యాపూరణ శ్లోకాన్ని వినిపించింది. అది తానే చేసిన పూరణ అని బొంకింది. శ్లోకంలోని పాండితీ మర్మాన్ని గమనించిన మహారాజు నిలదీసి కఠినంగా బెదిరించడంతో నిజాన్ని ఒప్పుకుని లొంగిపోయింది ఆ వేశ్య.

దుర్వాసమహర్షి శాపకారణంగా కాళిదాసు సరస్వతీ అంశతో జన్మించాడని, భోజచక్రవర్తి బ్రహ్మదేవుని అంశతో జన్మించాడని రాజసభలో అందరూ వింటుండగా ఆకాశవాణి పలికింది. కాళిదాసు మరణించిన ఏడు గడియలలో భోజరాజు కూడా ఆత్మత్యాగం చేసి అవతార పరిసమాప్తి చేయాలనీ ఆకాశవాణి ప్రకటించింది. భోజచక్రవర్తి కాళిదాసు శరీరంతోపాటు.తనూ చితిలో ప్రవేశించాడు. మహారాణి భర్తను అనుసరించింది.

కాంచీపుర పండితుని రూపంలో స్వయంగా అగస్త్యుడే కాళిదాసు కుమారుడిని కాళిదాసు తండ్రితో చేర్చాడు. కాళిదాసు కుమారుడికి సకల విద్యలను బోధించి తండ్రి అంతటివాడిని చేశాడు. సకలవిద్యా రాజమైన శ్రీవిద్యను ఉపదేశించాడు. జగద్గురువు ఆదిశంకరులను ఆశ్రయించి కుండలినీయోగ విద్యను స్వీకరించుమని ఆదేశించి వెళ్ళిపోయాడు కాంచీపురస్వామి. ఆ సమయంలో శిష్యసమేతుడై శ్రీశైలక్షేత్రంలో ఉన్నారు జగద్గురువు ఆదిశంకరులు. అగస్త్యుని కరుణ కారణంగా ఆదిశంకరుల ఆశ్రయం లభించింది కాళిదాసు కుమారునికి. కుండలినీ విద్యతోపాటు సాంగోపాంగంగా సౌందర్యలహరీ ఉపదేశాన్ని పొంది ధారానగరానికితిరిగివచ్చాడు కాళిదాసు కుమారుడు.

మంత్రధారలా వెలువడుతున్న భాస్కరాచార్యుల కంఠం కొన్ని నిముషాలు మౌనం వహించింది. ఆశ్రమంలో చెట్లమీది పక్షుల కూతలు, గంగాతీరంలోని పడవల సరంగుల గొంతులతో కలిసి మంద్రంగా మధురంగా వినిపిస్తున్నాయి. గంగానదిమీదినుండి చల్లని సాయంకాలపు గాలులు శరీరాలను మృదువుగా స్పృశిస్తున్నాయి. ఉండీ ఉండీ విశ్వనాథుని మందిరంలో గంటలు ఒళ్ళు ఝుల్లుమనేలా వినిపిస్తున్నాయి.ఆ గంటల ధ్వనులకు గోవుల అంబారావాలు, మదించిన వృషభాల రంకెలు జోడు వాయిద్యాలలాగా హాయిగా వినిపిస్తున్నాయి.

'లక్ష్మీధరా! కాళిదాసు కుమారుడు నిత్యమూ బీజాక్షర సంపుటీకరణంతో యంత్రసహితంగా సౌందర్యలహరీ ఉపాసన చేసేవాడు. సాధనా సమయంలో ఒకనాడు జరిగిన సంఘటన నీ కథకు కారణం అయ్యింది. యిన్నివేల సంవత్సరాలుగా జన్మ జన్మల పర్యంతమూ వెన్నాడుతున్న ప్రేమకూ, పగకూ కారణం అయ్యింది.. అదే..' అంటూ చప్పున ఆగిపోయాడు భాస్కరరాయలవారు. ఆయన చూపులు గవాక్షం మీద నిలిచిపోయాయి. మూడుమూరల గవాక్షం వెడల్పునా నల్లని తెరచాపలా విచ్చుకున్న మహాసర్పం పడగ కనిపించింది. అరచేతి వెడల్పున క్రూరంగా మెరుస్తున్న నీలిరంగు కనులతో లోపలికి చూస్తూ కసిగా బుసలు కొట్టింది ఇరవై మూరల పొడవు, మూరెడు లావు చుట్టుకొలతా ఉన్న కాలసర్పం.

(కొనసాగింపు వచ్చే సంచికలో..)

COMMENTS